సేవారంగం.. అభివృద్ధికి కీలక మార్గం...

ఆంధ్రప్రదేశ్ అవతరణ తర్వాత రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో సేవారంగం కీలక పాత్ర పోషించింది. వాణిజ్యం, హోటళ్లు, రెస్టారెంట్లు, రవాణా, సమాచారం, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, సాంఘిక, వ్యక్తిగత సేవలు దీని పరిధిలోకి వస్తాయి. గత దశాబ్ద కాలంగా తీసుకుంటున్న చర్యల ఫలితంగా ఈ రంగం గణనీయ వృద్ధిని సాధించింది. సేవారంగ కార్యకలాపాలను విస్తరించడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో ఆదాయ అసమాన తలు తగ్గడంతోపాటు ప్రాంతీయ వ్యత్యాసాలు కూడా తగ్గుతాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో సేవారంగంలో ప్రధాన పాత్ర వహిస్తున్న వాణిజ్యం, బ్యాంకింగ్, ఐటీ, పర్యాటక, సమాచారం రంగంలో జరుగుతున్న అభివృద్ధిని చర్చించే క్రమంలో ఈ సిలబస్ రూపొందించారు.

పేపర్- III
విభాగం-3 యూనిట్-5 సిలబస్

- ఆంధ్రప్రదేశ్‌లో సేవారంగం- రవాణా, కమ్యూనికేషన్, పర్యాటక, సమాచార, సాంకేతిక విజ్ఞానాలకు ప్రత్యేక ప్రాధాన్యంలో సేవారంగం ప్రాముఖ్యం, కూర్పు, వృద్ధి.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ తర్వాత రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో సేవా రంగం గణనీయమైన పాత్ర పోషించింది. 2008- 09లో ఈ రంగంలో 10.06 శాతం వృద్ధి నమోదైంది. ముఖ్యంగా సమాచారం, ప్రభుత్వ పరిపాలన, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ పరిశ్రమలు గణనీయ ప్రగతి సాధించాయి. 2008-09లో స్థిరధరల వద్ద రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తికి ఈ రంగం 51.1 శాతం సమకూర్చింది. టెలికాం రెగ్యులేటరీ అథారిటీ నివేదిక ప్రకారం... మార్చి 2009 నాటికి రాష్ట్రంలో 329.52 లక్షల టెలి ఫోన్ కనెక్షన్‌లు ఉన్నాయి. బ్యాంకింగ్ రంగం కూడా అభివృద్ధి బాట పట్టింది. కేంద్ర బ్యాంకు నియమావళి ప్రకారం మొత్తం పరపతిలో 40 శాతం ప్రాధాన్యతా రంగాలకు ఇవ్వాల్సి ఉండగా.. 2008 -09లో ఈ పరపతి 47.71 శాతానికి పెరిగింది. 2008 డిసెంబర్ నాటికి రాష్ట్రంలో బ్యాంకింగ్ రంగం మొత్తం రూ.1,95,521 కోట్ల పరపతినివ్వగా 2009 మార్చి నాటికి ఈ పరపతి రూ. 2,10,294 కోట్లు!



ఇక.. ఐటీ రంగం కూడా రాష్ట్రంలో శరవేగంగా అభివృద్ధి చెందు తోంది. రాష్ట్రాన్ని జ్ఞాన సమాజంగా మారుస్తూ ఐటీ రంగం వల్ల కలిగే లబ్ధిని అందరికీ.. ముఖ్యంగా గ్రామీణ ప్రజలకు అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. 2007-08 నాటికి ఐటీ రంగంలో 2,39,000 మంది ఉపాధి లభించగా.. అదే కాలానికి ఐటీ ఎగుమతుల విలువ రూ.26,122 కోట్లు. ఐటీ పరిశ్రమ, ఐటీ సంబంధిత సేవల ప్రోత్సాహా నికి 1999లో మొదటగా ప్రకటించిన ఐటీ విధానాన్ని జూన్ 2002లో సవరించారు. దానిని మార్చి 2005 నుంచి అమలు చేస్తున్నారు. సేవా రంగ కార్యకలా పాలు రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లోనే కేంద్రీకృతం కావడం ప్రాంతీయ అసమానతలకు దారి తీసింది.

ఎక్స్‌పెక్టెడ్ కొశ్చన్స్:

- **ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో సేవారంగం పాత్ర వివరిస్తూ ఆ రంగంలో వృద్ధిని తెలపండి?**

జ: ఆర్థికాభివృద్ధికి అవసరమయ్యే అవస్థాపనా సౌకర్యాలను తృతీయ రంగం అందిస్తుంది. అందువల్ల ఆ రంగాన్ని సేవారంగం అంటా రు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధి ద్వారా ఆర్థికాభి వృద్ధి సాధనకు సేవారంగం తోడ్పడుతుంది. రాష్ట్ర అవతరణ తర్వాత జీఎస్‌డీపీలో ఈ రంగ వాటా పెరగడంతో అభివృద్ధి చెం దుతున్న వ్యవస్థగా రాష్ట్రం రూపాంతరం చెందిందని భావించవ చ్చు. స్థిరధరల వద్ద రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తికి 2008-09లో సేవారంగం రూ.1,29,089 కోట్లు అందించింది. వాణిజ్యం, హోటళ్లు, రెస్టారెంట్లు, రియల్‌ఎస్టేట్, సమాచారం, ప్రభుత్వ పరి పాలన సేవారంగ కార్యకలాపాల్లో ప్రధానపాత్ర పోషిస్తున్నాయి. 2008-09లో వాణిజ్యం, హోటళ్లు, రెస్టారెంట్ల ద్వారా రూ.33,596 కోట్ల ఆదాయం లభించగా.. రియల్‌ఎస్టేట్, వ్యాపార సేవలు రూ. 20,815 కోట్ల ఆదాయాన్ని సేవా రంగానికి సమకూ ర్చాయి.

☞ ఈ నేపథ్యంలో రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ఆదాయం, ఉపాధి పెరుగుదలకు సేవారంగం ఏ విధంగా సహకరించిందో వివరిస్తూ రాష్ట్ర అవతరణ తర్వాత సేవారంగం వృద్ధిలో భాగంగా ముఖ్య మైన సేవారం గ కార్యకలాపాల వృద్ధిని పేర్కొనాలి.

- **ఆంధ్రప్రదేశ్‌లో సమాచార సాంకేతిక విజ్ఞానం ఆర్థికాభివృద్ధికి ఏ విధంగా దోహదపడుతుందో వివరించండి?**

జ. ప్రపంచ ఆర్థిక సంక్షోభ ప్రభావం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై కొంత మేర కనిపించినప్పటికీ.. ఐటీ రంగంలో రాష్ట్రం అధిక వృద్ధి సాధించింది. 2008-09లో ఐటీ రంగంలో ఎగుమతుల వృద్ధి 20 శాతం. కాగా.. జాతీయ సగటు 13.7 శాతం మాత్రమే. మొత్తం జాతీయ ఐటీ ఎగుమతుల్లో రాష్ట్ర వాటా 15.42 శాతం. ఈ రంగం 2008 మార్చి వరకు మొత్తం 2,39,000 మందికి ఉపాధి అవకాశాలు కల్పించగా.. మొత్తం పెట్టుబడులు రూ.10,101 కోట్లకు చేరుకున్నాయి. రాష్ట్రంలో ఐటీ యూనిట్లు ఎక్కువగా ఏర్పడటానికి.. ఐటీ పాలసీ-2005-10 ఎంతో దోహదపడింది. మెగాప్రాజెక్టులు, చిన్న, మధ్య తరహా సంస్థలు, టైర్-2 ప్రాంతాల్లో ఏర్పాటయ్యే ఐటీ యూనిట్లకు ప్రభుత్వం పలు ప్రోత్సాహకాలను ప్రకటించింది. ఈ క్రమంలో ఐటీ పార్కులు ఐటీ సెజ్‌లను ప్రోత్సహిస్తోంది. ఇప్పటి వరకు అన్ని మౌలిక సౌకర్యాలతో కూడుకున్న 26 ప్రాంతాలను ప్రైవేటు వ్యక్తులు అభివృద్ధి చేశారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్స్ (Information Technology Investment Regions) ఏర్పాటు ద్వారా 'స్నేహపూరిత పెట్టుబడి విధానాన్ని ప్రభుత్వం అమలుపరుస్తోంది.

☞ ఈ నేపథ్యంలో రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఐటీ రంగం ఏ మేరకు దోహదపడిందనే విషయాన్ని పరిశీలించాలి. ఈ రంగం అభివృద్ధికి ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరిస్తూ.. రాష్ట్రంలో ఉపాధికల్పన, పెట్టుబడులు, ఎగుమతుల వృద్ధిలో ఈ రంగం తోడ్పాటును గణాంకాల సహాయంతో వివరించాలి.

- **రాష్ట్రంలో సేవారంగ అభివృద్ధి దిశగా.. పర్యాటక రంగానికి ప్రభుత్వం అందించిన తోడ్పాటును వివరించండి?**

జ. పర్యాటక రంగం రాష్ట్రంలో సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక అభివృద్ధికి తోడ్పడింది. ఈ రంగం ద్వారా ఉపాధి అవకాశాలు పెరగడంతోపాటు ప్రభుత్వానికి రాబడి పెరిగింది. పర్యాటక రంగ అభివృద్ధికి 1976లో ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ ఏర్పాటయింది. పర్యాటక అభివృద్ధికి అవసరమైన అవస్థాపనా సౌకర్యాలు కల్పించడం, ప్రధాన పర్యాటక ప్రదేశాల్లో హోటళ్లు, రెస్టారెంట్లు ఏర్పాటు చేయడంతో పాటు ఎకోటూరిజమ్‌ను ఈ సంస్థ ప్రోత్సహిస్తోం ది. 2008-09లో టూర్ ప్యాకేజీల ద్వారా ఈ సంస్థ రూ. 47.57 కోట్ల రాబడి ఆర్జించింది. 2008-09వ సంవత్సరంలో రాష్ట్రానికి విచ్చేసిన మొత్తం పర్యాటకుల సంఖ్య 73.79 లక్షలుగా నమోదు కాగా... మొత్తం రాబడి రూ.109 కోట్లకు పెరిగింది. 2006వ సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం నూతన పర్యాటక విధానాన్ని రూపొందించింది. ఈ క్రమంలో పురాతత్వ, పర్యావరణ ప్రాధాన్యత గల ప్రాంతాల్లో ఆకర్షణీయమైన పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేయాలని సంకల్పించింది. దీనివల్ల ఉపాధి అవకాశాల్లో మెరుగుపడి పేదరిక నిర్మూలన సాధ్యమవుతుంది.

☞ ఈ క్రమంలో పర్యాటకరంగ అభివృద్ధి ద్వారా ఉపాధి, రాబడులు పెరగటాన్ని..రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తిలో సేవారంగం ప్రాధాన్యత పెరగడంలో పర్యాటక రంగం కీలకంగా మారిన విధాన్ని వివరించాలి. పర్యాటక రంగ అభివృద్ధి ద్వారా సేవారంగంలో ముఖ్య కార్యకలాపాలైన హోటళ్లు, రెస్టారెంట్లు, వాణిజ్యం, బ్యాంకింగ్, సమాచార రంగాలు అభివృద్ధి చెందిన తీరును ప్రస్తావించాలి.

- **రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి బ్యాంకింగ్ రంగం అందించిన తోడ్పాటు వివరించండి?**

జ. వివిధ రంగాలకు అవసరమైన పరపతిని అందించడం ద్వారా రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి బ్యాంకింగ్ రంగం తోడ్పడింది. జాతీయీకరణకు ముందు కొన్ని నగరాలు, పట్టణాలకు మాత్రమే జాతీయ బ్యాంకులు పరిమితమయ్యాయి. అయితే జాతీయీకరణ తర్వాత బ్యాంకింగ్ వ్యవస్థ గ్రామీణ ప్రాంతాలకూ విస్తరించింది. 2008 డిసెంబర్ నాటికి రాష్ట్రంలో 6296 బ్యాంకు కార్యాలయాలు పనిచేస్తున్నాయి. డిసెంబర్2008 నాటికి బ్యాంకుల పరపతి-డిపాజిట్ నిష్పత్తి 102.13 శాతం కాగా కేంద్రబ్యాంకు నియమావళి ప్రకారం పరపతి - డిపాజిట్ నిష్పత్తి 60 శాతం మాత్రమే. మొత్తం నికర బ్యాంకుల నికర పరపతి మొత్తంలో 24.48 శాతం వ్యవసాయ పరపతిగా అందించాయి. చిన్న,మధ్య తరహా సంస్థలకు రుణాలు, విద్యా రుణాలు, స్వయం సహాయక బృందాలు, రైతుమిత్ర బృందాలతో పాటు అన్ని రకాల ప్రభుత్వ పథకాల అమలుకు వాణిజ్య బ్యాంకులు రుణాలు సమకూరు స్తున్నాయి.

☞ ఈ క్రమంలో వాణిజ్యబ్యాంకులు అందించే పరపతి వల్ల వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగంలో జరిగి న వృద్ధిని పేర్కొనాలి. రాష్ట్రంలోని అన్ని రంగాల్లో ఉపాధి అవకాశాల, ప్రజల జీవన ప్రమాణాల మెరుగవడానికి వాణిజ్య బ్యాంకుల పాత్రను వివరించాలి.

- **రాష్ట్ర సేవారంగ అభివృద్ధికి రవాణా రంగం తోడ్పాటును వివరించండి?**

జ. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ తర్వాత రవాణారంగం ఎంతో అభివృద్ధి సాధించింది. రోడ్డు రవాణాతో పాటు రైల్వే, నౌకాయానం, విమానాశ్రయాల అభివృద్ధి జరిగింది. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో రోడ్డు రవాణా ప్రధాన పాత్ర వహిస్తూ వాణిజ్యం మెరుగుపడటానికి దోహదపడింది. రవాణా రంగంలో స్వయం ఉపాధిని ప్రోత్సహించే దిశగా.. మహిళలకు హైదరాబాద్‌లో 500, విజయవాడ, విశాఖపటణం నగరాల్లో 100 కొత్త పర్మిట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలకు ప్రాధాన్యమిచ్చారు. 2008-09లో రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్‌టీసీ) ఇంధన సామర్థ్యం ఒక లీటరుకు 5.25 కి.మీ.కు చేరుకుంది. ఈ సంస్థ 1.13 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించింది. విమానాశ్రయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తోంది. 2008-09

సంవత్సరంలో రాష్ట్రంలోని చిన్నపోర్టులు ద్వారా 26.88 మిలియన్ టన్నుల కార్గో రవాణా జరిగింది. ఫలితంగా దేశంలో కార్గో నిర్వహణలో రాష్ట్రం రెండో స్థానంలో నిలిచింది.

☞ ఈ నేపథ్యంలో వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధి సాధనలో రవాణారంగ ఆవశ్యకతను వివరించాలి. రోడ్డు, రైల్వే, నౌకా, విమానాశ్రయాల వృద్ధి.. ఉపాధి, ప్రజల ఆదాయాల పెరుగుదలకు ఎలా దోహదపడతాయో విశ్లేషించాలి.

ముఖ్యాంశాలు:

- రాష్ట్ర సేవారంగంలో 2008-09లో 10.06 శాతం వృద్ధి నమోదైంది.
- రాష్ట్రంలో ఐటీ పరిశ్రమ వృద్ధికి 1999లో ప్రారంభించిన ఐటీ విధానాన్ని 2002లో సవరించారు. ఇది 2005 నుంచి అమల్లోకి వచ్చింది.
- గత ఆర్థిక సంవత్సరంలో స్థూల దేశీయోత్పత్తికి సేవా రంగం అందించిన మొత్తం రూ.1,29,089 కోట్లు.
- 2008 మార్చి వరకు రాష్ట్రంలో ఐటీ రంగంలో 2, 39, 000 మందికి ఉపాధి అవకాశాలు లభించాయి.
- ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్స్ ఏర్పాటు ద్వారా స్నేహపూరిత పెట్టుబడి విధానాన్ని ప్రభుత్వం అమలు పరుస్తోంది.
- రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి పర్యాటక రంగం అభివృద్ధి సంస్థ 1976లో ఏర్పాటైంది.
- 2008 నాటికి రాష్ట్రంలోని బ్యాంకుల కార్యాలయాల సంఖ్య 6296.
- దేశంలో ఎయిర్ కార్గో నిర్వహణలో రాష్ట్రం రెండో స్థానం సంపాదించింది.